2. నెనరు తండ్రి యన నా భారం – ననుఁ గనులఁ జూడను నీ భారం = నిన్నే నమ్మ నాదు భారం – నన్నెపుడు కావ నీ భారం ॥బో దేవా॥

3. కరుణ సాగర యన నా భారం – కరుణం జూపను నీ భారం = శరణని వేడను నా భారం – సంతరింప నీ భారం ॥బో దేవా॥

4. మనవి సేయ నాది – భారం తనవిఁ దీర్పను నీ భారం = నిను మది దలఁప గ నా భారం – నన్ను గా వనీ భారం ॥బో దేవా॥

–ఎస్ ఎస్ షేతు

## 416 క్రీస్తు విశ్వాసుల కాశ్రయము

రా – ఖరహరప్రియ (చాయ : మానవుల మేలుకొరకు) తా–రూపకము

నాధ యేసు నాధ క్రీస్తు – నాధ – నేననాధ = సాధు జనులఁ బ్రోచు –సదయు నీ దయ కాదా ॥నాధ॥

1. గతిఁ దలఁపని మూర్ఖచిత్త – గమనుఁడనేఁ గానా = సతతముననుఁ గరుణఁ బ్రోచెదు – గతియ నీవు కావా ॥నాధ॥

2. పాపమందు జననమైన – పామరుండ నేఁగానా = దాపు జేరి వేఁడెద నా – ప్రాపు నీవు గావా ॥నాధ॥

3. కుటిల బుద్ధిగల వాఁడను –క్రూరుఁడ నేఁగానా = కటకట ననుఁ గని కరించు – కరుణ నీది గాదా ॥నాధ॥

4. ఆది కర్త వీవు గావె – యఖిల లోకమునకును = బీదవారి నెల్లఁ బ్రోచు – బిరుదు నీది గాదా ॥నాధ॥

5. సారమైన సత్యశాస్త్ర – సార మీవు గావా = ఘోరమైన పాపి జనులఁ – గోరి పిలువ లేదా ॥నాధ॥

6. జీవ నాధారమైన – త్రోవ నీవు గావా = దేవదేవ యెహవా నా – దిక్కు నీవు గావా ॥నాధ॥

–పసుపులేటి దావీదు



## 417 యేసు మన ఆశ్రయ రక్షకుఁడు

రా – ముఖారి (చాయ : ఉన్నపాటున) తా–త్రిపుట

నాకై చీలిన యుగ యుగముల శిల ముక్తి – నా కిమ్ము శ్రీ యేసువా = లోక రక్షక నన్ను నీ లోపల దాగి – వీఁకతోడను నుండనిమ్ము సద్గుణ శీలా॥నాకై॥

1. చీలఁబడిన నీదు ప్రక్క విడిచి పారు – జాలు జలము రక్తము = చాల నా పాపపు తీర్పు పాపబలమ్ము – చాలు రూపును మాపి నన్నుఁ బావనుఁ జేయు ॥నాకై॥

2. నీదు న్యాయంబగు ప్రామన్య విధులను – నాదు సత్కృతి తృప్తిగా = నాదరింపవు పారమార్థకమైనట్టి – నాదు నాసక్తి బాష్పమును బారిన నాకు ॥నాకై॥

3. నేను జేసిన పాపములఁ ద్రుంప నెవరిని – గాన నేరను యేసువా = దీనుఁ డనై వచ్చి నీ మేటి సిల్వను – మానక నే హత్తుకొనియెద సచ్చరిత ॥నాకై॥

4. కట్టఁ బుట్టము లేక పుట్టముకై యాశ – బుట్టి నీ యెడ వచ్చితి = నెట్టి సహాయము లేక నీపై మదిఁ – బుట్టి నీ సత్కృపఁ బొందఁజూచెద నయ్య ॥నాకై॥

5. పరమకల్మషుఁడనై నే నీటి బుగ్గకుఁ –బరుగు లెత్తెద నిప్పుడు = పరమ పావన నన్నుఁ గడుగుము లేకున్న – మరణ మొందుదు నేను ఘోర పాపవిదూర ॥నాకై॥

–తటవర్తి నారాయణస్వామి

## 418 ముక్తిఁ గనుట

రా – భూపాళము (చాయ : మేలుకొనరే) తా–అట

ముక్తిఁ గనరే

ముక్తిఁ గనరే మీ మనంబుల – శక్తిగల రక్షకుని పలుకులు = ముక్తిసాధనములకు మూలము – భక్తిగొని యానంద మొందరే ॥ముక్తి॥

1. పాపభారము క్రింద శ్రమపడు – పాపులారా రండు నేనే = ప్రాపు నెమ్మది మీకిడుదునని – పరమరక్షకుఁ డాన తిచ్చెను ॥ముక్తి॥